పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి
కేవలం 148 రోజుల్లో ఉద్యోగాలు
భర్తీ చేసిన ఘనత లోకేష్‌కే
దక్కుతుంది. విద్యా వ్యవస్థ అభివృద్ధికి
టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది.
ప్రభుత్వ పాఠశాలలను
దేవాలయాలుగా తీర్చిదిద్దుతున్నారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 08.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 108 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# చేనేతకు చేయూత... బీసీలకు భరోసా







**చీరాలలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు**

**కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం**

**బీసీ సంరక్షణ చట్టానికి ముసాయిదా సిద్ధం**

**చీరాల,(జర్నలిస్ట్ ఫైల్) :** బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ. 4 వేల చొప్పున నెలకు రూ. 35 కోట్లు ఇస్తున్నాం. రూ. 420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ. 79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ. 10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం.

మిగతా 2లో...

# అక్టోబరులో మరో డీఎస్సీ

- మెగా డీఎస్సీ-2025 ప్రక్రియ పూర్తిగా పారదర్శకం
- ఎంపికైన అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- కమిషనర్ తమీమ్ అన్సారియా



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మెగా డీఎస్సీ-2025 నిర్వహణపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలు, ఆరోపణలను అభ్యర్థులు ఎవరూ నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇప్పటికే డీఎస్సీ ప్రక్రియపై ప్రభుత్వ ఉన్నతాధికారులు మూడుసార్లు స్పష్టమైన వివరణ ఇచ్చినప్పటికీ, ఇంకా దుష్ప్రచారం సాగుతుండటంతో మరోసారి క్లారిటీ ఇస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సంతోషి పార్వతి, వీవీవీ భాస్కర్ రెడ్డి అనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని వివరించారు. జోన్-1 ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 2 ఖాళీలు ఉండగా, హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల మేరకే అర్హులైన అభ్యర్థికి కేటాయించామని, కడపకు చెందిన భాస్కర్ రెడ్డికి 68వ ర్యాంకురాగా, మొత్తం 8 ఖాళీల్లో చివరి పోస్టు హారిజాంటల్ రిజర్వేషన్ కింద జూబో అభ్యర్థికి దక్కిందని కేస్ స్టడీలతో సహా వెల్లడించారు. డీఎస్సీ-2025ని అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు మొత్తం 12 రకాల భద్రతా విధానాలను అనుసరించామని కమిషనర్ తెలిపారు. ప్రైవసీ, టాంపర్ ప్రూఫ్ భద్రతా వ్యవస్థలోనే ప్రశ్నాపత్రాల రూపకల్పన ప్రక్రియ జరిగిం దని, ఏ ఒక్క ఉపాధ్యాయుడో ఒంటరిగా కాకుండా అనేకమంది ఉత్తమ ఉపాధ్యాయులు సంయుక్తంగా ప్రశ్నాపత్రాలను రూపొందిం చారని స్పష్టం చేశారు.

ఎంపికైన మెరిట్, సెలక్షన్ లిస్టులను ఎవరైనా, ఎప్పుడైనా ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకునేలా అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు తమ ప్రతిభపై ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అనవసర వివాదాల పట్ల

- 2లో...

# డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం...

## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** డీఎస్సీ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినప్పటికీ వైసీపీ నేతలు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం దుర్మార్గమని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం 148 రోజుల్లో డీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందని తెలిపారు.

విద్యా వ్యవస్థ అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం మొదటి నుంచీ ప్రాధాన్యం ఇస్తోందని, గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులను సింగపూర్‌కు పంపించిన ఘనత కూడా టీడీపీకే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను దేవాలయాలుగా తీర్చిదిద్దే దిశగా నారా లోకేష్ చర్యలు చేపడుతున్నారని చెప్పారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు.

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించినప్పటికీ వైసీపీ నేతలు అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకోవడమే వైసీపీ లక్ష్యంగా మారిందని విమర్శించారు. డీఎస్సీపై కోర్టులో పిటిషన్ వేసిన వైసీపీ నేతలు ఆధారాలు చూపాలని కోర్టు ప్రశ్నించడంతో వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు.

మిగతా 2లో...




# వందేమాతరం బిల్లుకు గ్రీన్ సిగ్నల్

- రాష్ట్రపతి ముర్ము ఆమోదముద్ర గీతాలాపనను అడ్డుకుంటే మూడేళ్లు జైలు శిక్ష



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ (అమెండ్ మెంట్) యాక్ట్ 2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు మిగతా 2లో...

# మరో చెస్ కిరీటం ప్రజ్ఞానందదే

- సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్‌లో చాంపియన్
- ప్రత్యర్థులపై ఆధిక్యంతో ముందుగానే టైటిల్ ఖాయం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భారత చెస్ క్రీడాకారుడు ఆర్ ప్రజ్ఞానంద తొలిసారి సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్‌ను గెలిచాడు. మిగతా 2లో...



# 90 ఏళ్ల వృద్ధురాలి చిన్న కోరిక.. సీఎం చంద్రబాబు పెద్ద మనసు

**చీరాల(జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి ఫొటో దిగాలన్న 90 ఏళ్ల వృద్ధురాలు పుష్పావతి ఆకాంక్షను సీఎం నెరవేర్చారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆమె వ్యక్తం చేసిన కోరిక తన దృష్టికి రావడంతో చీరాలలో కలుసుకుని మాట్లాడతానని ఎక్స్ వేదికగా చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు చీరాలలో పుష్పావతిని ప్రత్యేకంగా పిలిపించుకుని ఆప్యాయంగా పలకరించి, ఆమెతో ఫొటో దిగారు. సీఎంతో ఫొటో దిగడంపై పుష్పావతి ఆనందం వ్యక్తం చేశారు.

ఇదే సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు మగ్గంపై వస్త్రంతో మిగతా 2లో...

# ఎస్సీల హక్కులపై రాజీ లేదు

- వివక్ష, అట్రాసిటీ కేసుల్లో వేగంగా న్యాయం
- సంక్షేమ పథకాల అమలుపై తిరుపతిలో అధికారులతో సమీక్ష
- కిషోర్ మక్వానా ఆదేశాలు

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు.

శుక్రవారం మధ్యాహ్నం స్థానిక శ్రీ పద్మావతి అతిథి గృహంలో భారత జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా, తిరుపతి ఎం.పి. గురుమూర్తి , జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సెక్రటరీ శ్రీనివాస్, డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రీసర్చ్ అధికారి వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు లతో కలసి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా మాట్లాడుతూ.... జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిగతా 2లో...

# ఆగస్టులోనే వెలిగొండకు కృష్ణా జలాలు

- 90-99% పనులు పూర్తి
- టిబీఎం తొలగింపు తుది దశలో
- నిర్వాసితులకు రెండు విడతల్లో రూ.600 కోట్ల పరిహారం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఫ్లోరైడ్ బాధిత, వెనుకబడిన ప్రకాశం జిల్లాకు మూడు దశాబ్దాల కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ఆగస్టు కృష్ణానెలలోనే కృష్ణా జలాలు తీసుకెళ్ళేందుకు చర్యలు వేగవంతం చేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 ఆగస్టు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని 2024లోనే నిర్దేశించుకున్నామని, ఆ లక్ష్యానికి అనుగుణంగా గత రెండేళ్లలో దాదాపు రూ. 3,000 కోట్లు వెచ్చించి రాత్రింబవళ్లు పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని వివిధ పనులు 90 నుంచి 99 శాతం వరకు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రాజెక్టు లో మిగిలిన పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

**టన్నెల్ పనులు శరవేగంగా :** కొల్లంవాగు నుంచి కృష్ణా జలాలు టన్నెల్‌కు చేరే అప్రోచ్ ఛానెల్ పనులు పూర్తయ్యాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన గేట్ల పనులు కూడా పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. టన్నెల్-1, టన్నెల్-2లకు సంబంధించిన 286 మీటర్ల సిసి లైనింగ్ పనులను ఈ నెల 18వ తేదీలోగా పూర్తి చేసేలా, ఐదు గ్యాంట్రీలతో ప్రత్యేక మిగతా 2లో...

# గ్రామాలకూ విస్తరిస్తున్న అన్న క్యాంటీన్లు




- 70 గ్రామీణ అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.181.91 కోట్ల మంజూరు
- మూడేళ్లపాటు రూ.5కే నాణ్యమైన భోజనం
- కూటమి ప్రభుత్వ నిర్ణయం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** 'అన్న క్యాంటీన్' దీనికి పేద, ధనిక తేడా లేదు. ఆకలి మాత్రమే చూస్తుంది. అల్పాహారమైనా, భోజనమైనా రూ. 5కే అందిస్తుంది. "రోడ్డు పక్క బంకులో టీ తాగాలన్నా రూ. 10కి తక్కువ తీసుకోవడం లేదు, మిగతా 2లో...

## 90 ఏళ్ల వృద్ధురాలి చిన్న కోరిక.. సీఎం చంద్రబాబు పెద్ద మనసు



(మొదటి పేజీ తరువాయి)

రూపొందించిన చంద్రబాబు చిత్రపటాన్ని ముఖ్యమంత్రికి అందించారు. ఎంతో నైపుణ్యంతో తన చిత్రపటాన్ని చేనేత వస్త్రంపై అద్భుతంగా నేసిన దంపతులను చంద్రబాబు అభినందించారు. వారి కళా నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

## అక్టోబరులో మరో డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన చెందకుండా రాబోయే పరీక్షలపైనే దృష్టి సారించాలని తమీమ్ అన్సారియా సూచించారు.

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా : మరోవైపు మెగా డీఎస్సీ-2025 నిర్వహణలో భాగంగా స్పోర్ట్స్ కోటా కింద చేపట్టిన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో కూలంకషంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాను రూపొందించామని ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో పిజారి ఇస్మాయిల్ భాషా, అన్వర్ భాషా అనే అభ్యర్థుల జూడో క్రీడా సర్టిఫికెట్లు నకిలీవంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఆ సర్టిఫికెట్లు ఆంధ్రప్రదేశ్ జూడో ఫెడరేషన్ ద్వారా అధికారిక గుర్తింపు పొందినవేనని, దీనిపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయడం తప్ప గ్రీవెన్స్ ద్వారా ఎవరూ నేరుగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఆ ఆడియో టేప్‌లపై ఇప్పటికే క్రిమినల్ కేసులు : కొన్ని క్రీడా సంఘాలు తమ అంతర్గత విభేదాలతో ఒకరిపై ఒకరు చేసుకుంటున్న ఆరోపణలను కూడా డీఎస్సీ ఎంపిక ప్రక్రియకు ఆపాదిస్తూ అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని ఎండీ ఆవేదన వ్యక్తం చేశారు. అసత్యాలు, పుకార్లతో ప్రచారంలోకి తెచ్చిన కొన్ని ఆడియో టేప్‌లపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు వేగవంతం చేశామని హెచ్చరించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అనర్హులకు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఇప్పటికైనా ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే, అటువంటి పత్రాలు జారీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎండీ భరణి స్పష్టం చేశారు.

## వందేమాతరం బిల్లుకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది. ఇటీవలే పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. తాజాగా నిబంధనల ప్రకారం, జాతీయ గీతం లేదా గేయం ఆలాపనను అడ్డుకున్న వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ పాటలు ఆలాపన జరుగుతున్న సమయంలో అడ్డంకులు సృష్టించేవారికీ ఇవే శిక్షలు విధిస్తారు. అంతకుముందున్న చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం, కేవలం జాతీయ గీతానికి ఈ రక్షణలు ఉండేవి. ప్రస్తుతం వందేమాతరం గేయానికీ ఇవే రక్షణలు కల్పిస్తూ చట్టంలో మార్పులు చేశారు.

## మరో చెస్ కిరీటం ప్రజ్ఞానందదే

(మొదటి పేజీ తరువాయి)

మరొక రౌండ్ మిగిలి ఉండగానే అతడు విజేతగా నిలిచాడు. జావోఖిర్ సిందరోవ్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో 23.5/35 పాయింట్లు సాధించాడు. ఇతర ప్లేయర్ల కంటే ఒకటిన్నర పాయింట్లు ఎక్కువగా ఉండటంతో టైటిల్ ఖాయమైంది. ఈ మేరకు భారత చెస్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

"భారత చెస్ అభిమానులకు గుడ్ న్యూస్. ప్రజ్ఞానంద గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ విజేతగా అవతరించాడు. ఇది అతడికి తొలి రాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్. కంగ్రాట్స్ ప్రజ్ఞానంద" అని పోస్టు చేసింది. ఈ ఏడాదిలో నార్వే చెస్ 2026 టైటిల్‌ను కూడా ఈ 20 ఏళ్ల కుర్రాడు గెలిచిన సంగతి తెలిసిందే.

## ఆగస్టులోనే వెలిగొండకు కృష్ణా జలాలు

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. వెలిగొండ టన్నెల్‌లో ఉన్న 1,900 మెట్రిక్ టన్నుల బరువు, 175 మీటర్ల పొడవు కలిగిన నదీ మిషన్‌లో ఇప్పటికే 70 శాతం వరకు తొలగింపు పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన 30 శాతం పనులను కూడా రాబోయే 7 నుంచి 10 రోజుల్లో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఐతే 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో టిబిఎం ను అంగుళం కూడా కదపలేదని, చుక్కనీరు కూడా బయటకు వెళ్ళే పరిస్దితి లేదని, అయినా కూడా జాతికి అంకితం పేరుతో ప్రజల్ని మోసం, దగా చేశారని దుయ్యబట్టారు.

**ఫీడర్ కెనాల్ పనుల్లో గణనీయమైన పురోగతి :** 100 క్యూసెక్కుల నీరు వస్తేనే బండ్ లు తెగిపోయే పరిస్దితి ఉన్న ఫీడర్ కెనాల్ ను బలోపేతం చేసేలా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు రూ. 460 కోట్లు మంజూరు చేసి, ఈ ఏడాది జనవరిలో పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 5.3 కిలోమీటర్ల సీసీ వాల్ పనులు పూర్తయ్యాయని, మొత్తం 11 కిలోమీటర్ల లైనింగ్ పనులను 5 నెలల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. ఫీడర్ కెనాల్‌కు సంబంధించిన ఈస్టర్న్ మెయిన్ కెనాల్, సుంకేసుల, గొట్టిపడియ రెగ్యులేటర్ల పనులను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ప్రాజెక్టు పూర్తి చేయడానికి అత్యంత కీలకమైన నిర్వాసితులకు 900 కోట్ల పరిహారం ఇవ్వవలసి ఉండగా, ఒక్క నయా పైసా కూడా ఇవ్వకుండా, గత ప్రభుత్వం వారిని అత్యంత చులకనగా చూసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెలిగొండ నిర్వాసితులకు అండగా నిలబడి, ఇప్పటికే 2,560 నిర్వాసిత కుటుంబాలకు రూ. 318 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 4,761 కుటుంబాలకు రూ. 600 కోట్లను రెండు విడతల్లో అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా రూ. 300 కోట్లు ఈ వారంలో, మరో రూ. 300 కోట్లు రాబోయే మూడు నుంచి నాలుగు వారాల్లో అందించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని మంత్రి పేర్కొన్నారు.

మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం గత ఐదేళ్లలో నిలిచిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేగవంతం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నిధులు సమకూర్చడంతో పాటు నిర్వాసితులకు పరిహారం అందిస్తూ, టన్నెల్స్, ఫీడర్ కెనాల్, రెగ్యులేటర్ల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సలహాదారులు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, సిఈ రమేష్ బాబు, ఎస్ఈ అబూతలేం మరియు ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చేనేతకు చేయూత... బీసీలకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ. 4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.

**బీసీలకు అండగా... :** "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్దమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ. 20 వేల చొప్పున రెండేళ్లలో రూ. 505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ. 20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ. 2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ. 5 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు



ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా... గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ. 1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ. 1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని :** "గత పాలనలో రాజధాని లేకుండా చేశారు... రాష్ట్రం పేరు చెబితే ఇతర ప్రాంతాల్లో చులకన అయ్యేలా చేశారు. అద్భుతమైన నగరం ఉండాలనే అమరావతిని నిర్మిస్తున్నాం. రాజధానిపై గత పాలకులు నాలుక మడతపెట్టారు. మూడు ముక్కలాట ఆడారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమైనా తమ రాజధాని నగరాలను ఘనంగా చెప్పుకుంటున్నాయి. గత పాలనలో రాజధానే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. ఆగస్టు 13 తేదీన రాజధానిలోని ప్రధాన రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. వేగంగా జరుగుతున్న పనులు చూసి రాజధానిపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు. మావిగన్, వాటికన్ అంటూ ఏవోవో చెబుతున్నారు. మళ్లీ మూడు ముక్కలాట కావాలా...? రాజధానిని విధ్వంసం చేసుకుంటామా..? కుటుంబానికి ఇల్లు, రాష్ట్రానికి రాజధాని అవసరం. గత ప్రభుత్వం రాష్ట్ర పరువును తీసేసింది. ఇమేజ్ ను దారుణంగా దెబ్బతీసింది. కూటమి వచ్చాక మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. వాళ్లది బ్యాడ్ ఇమేజ్... మాది బ్రాండ్ ఇమేజ్. కోర్టు కేసులు వేసి అడ్డుకున్నా మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఏడాదిన్నర తర్వాత ఇప్పుడు మళ్లీ పేపర్ లీక్ అంటూ కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. కోర్టు చీవాట్లు పెట్టినా... మళ్లీ ధర్నాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తూ ప్రజలను వేధిస్తున్నారు. జెన్-జీ యువత అభివృద్ధిని కోరుకుంటోంది. కానీ కొందరు గొడ్డలి జనరేషన్ కు చెందిన వారు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. వీళ్లది గొడ్డలి జె. అభివృద్ధిని అడ్డుకునేలా చేసే అరాచకాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. కఠిన చర్యలకు వెనుకాడం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం :** "చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. తన ప్రసంగం అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు.

సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు సందర్శించారు. సీబీఎన్ జీవిత చరిత్రను ఆవిష్కరిస్తూ మహతి అనే యువతి 40 పెన్సిళ్లతో రూపొందించిన మైక్రో ఆర్ట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. బాపట్ల, సూర్యలంక సహా జిల్లాలోని వివిధ బీచ్ ల సమాచారాన్ని ప్రజలకు అందించేలా రూపొందించిన బే ఆఫ్ బాపట్ల వెబ్ సైట్, హ్యాండ్ బుక్ ను సీఎం విడుదల చేశారు. బాపట్ల లీప్స్ పేరుతో వివిధ రంగాల్లో యువతకు అందించే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేత రంగ అభివృద్ధికి సంబంధించి ఫ్యాబ్ ఇండియా సహా నాలుగు సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

## డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం... దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ నేతలకు కోర్టులంటే గౌరవం లేదని, గతంలో పలుమార్లు కోర్టులతో మొట్టికాయలు తిన్నారని ఆలపాటి విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ఒక అంశాన్ని పదేపదే ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారని వైసీపీ నేతలు పగటికలలు కంటున్నారని అన్నారు. వైసీపీ నేతలంతా మంత్రి నారా లోకేష్‌పై విమర్శలు చేయడమే ఆయన బలానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**బహిరంగ చర్చకు రావాలి :** డీఎస్సీ అంశంపై వైసీపీ నేతలకు నిజంగా ధైర్యం ఉంటే శనివారం ఉదయం 10 గంటలకు తెనాలి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు రావాలని ఆలపాటి రాజేంద్రప్రసాద్ సవాల్ చేశారు. డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న వారు ఆధారాలతో రావాలని అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ డీఎస్సీపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. సీబీటీ విధానంలో పారదర్శకంగా పరీక్ష నిర్వహించినా అక్రమాలు జరిగాయని ఆరోపించడం సరికాదన్నారు. డీఎస్సీపై హైకోర్టులో పిల్ దాఖలు చేసి ఆధారాలు చూపాలని




న్యాయస్థానం ప్రశ్నించడంతో వెనక్కి తీసుకున్నారని పేర్కొన్నారు.

అధికారంలోకి వస్తే డీఎస్సీ నిర్వహిస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేస్తామని, మద్యపాన నిషేధం చేస్తామని వైసీపీ హామీలు ఇచ్చిందని, వాటిలో ఎన్ని అమలు చేశారని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడవద్దని హితవు పలికారు. ఎన్నికల హామీలో భాగంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ, టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. మెగా డీఎస్సీ రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా జరిగిందని, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. డీఎస్సీపై వైసీపీ నేతలకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.

జెన్‌జీ యువతను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా 'షైనింగ్ స్టార్' వంటి కార్యక్రమాలతో ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు రాజకీయ ఉద్యమాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ధారపనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకూ విస్తరిస్తున్న అన్న క్యాంటీన్లు

(మొదటి పేజీ తరువాయి)

అన్న క్యాంటీన్లలో ఉదయం అల్పాహారమైనా మధ్యాహ్నం, రాత్రికి భోజనమైనా రూ. 5కే ఇస్తున్నారు. నాణ్యమైన ఆహారం ఇంత తక్కువకు ఎక్కడ దొరుకుతుంది?" అని అక్కడికొచ్చే వారంతా ముక్తకంఠంతో జై కొడుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి ప్రారంభించిన అన్న క్యాంటీన్లు కొద్ది రోజుల్లోనే వారందరి ఆదరణ చూరగొన్నాయి. వీటి పుణ్యమా అని వివిధ ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు వచ్చేవారు, చిరు వ్యాపారులు, కార్మికులు, నిరుద్యోగులు, వలస కూలీలు ఇలా ఎందరో సంతృప్తిగా ఆరగిస్తున్నారు. అంతేగాక సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకొనే విద్యార్థులకూ రూ. 5కే కడుపు నిండుతోంది.

తాజాగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'అన్న క్యాంటీన్ల'కు మరో శుభవార్త అందింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో 70 అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కాలానికి నిధులను మంజూరు చేసింది.

**మూడేళ్ల ఒప్పంద కాలానికి రూ.181కోట్లు :** 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి - మార్చి, 2026 రెండు నెలలకు రూ. 9.18 కోట్లు, 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ. 57.51 కోట్లు, 2027-28 ఆర్థిక సంవత్సరానికి 57.69 కోట్లు, 2028-29 ఆర్థిక సంవత్సరానికి రూ. 57.51 కోట్లు మొత్తంగా రూ. 181.91కోట్లను దీని కోసం ఖర్చు చేయనుంది. హెచ్?కేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ సంస్థ ఈ భోజనాల సరఫరాకు ముందుకు వచ్చిందని, బయోమెట్రిక్ ఆధారంగా రియల్ టైం టోకెన్ డేటాతో వారికి బిల్లుల చెల్లింపు చేయాలని మున్సిపల్ పరిపాలన శాఖ విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొంది.

# ఎస్సీల హక్కులపై రాజీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు, వారి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వసతి గృహాల్లో అవసరమైన మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సహాయం, స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, భవనాల మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం తదితర అంశాల అమలు పై సమీక్షించారు. అలాగే షెడ్యూల్డ్ కులాల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంబంధిత పథకాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. షెడ్యూల్డ్ కులాలపై జరుగుతున్న దాడులు, వివక్ష, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు పరిహారం, న్యాయ సహాయం తదితర అంశాలపై సమీక్షిస్తూ బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలను సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ వర్గాలపై వివక్షకు తావులేకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.

షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల అమలులో సాంఘిక సంక్షేమ శాఖతో పాటు రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలోని ఎస్సీ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుపతి జిల్లా యంత్రాంగం తరఫున జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాల పురోగతి, విద్యార్థుల సంక్షేమం, వసతి గృహాల పరిస్థితి, ఆర్థిక సాధికారత కార్యక్రమాలు, ఎస్సీ అట్రాసిటీ కేసుల పరిష్కారం తదితర అంశాలకు సంబంధించిన జిల్లా సమీక్షా నివేదికపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానాకు తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, విద్య, సంక్షేమం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మెడికోలపై దాడి ఘటనపై మంత్రి సత్యకుమార్ ఆగ్రహం

- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోంమంత్రికి విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థులు ప్రియాంక, ఉమేష్ తీవ్రంగా గాయపడిన ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితుల తీరును తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై ఎలాంటి జాప్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


తీవ్రంగా గాయపడిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరా తీశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ప్రియాంక ఆరోగ్య పరిస్థితి తనను తీవ్రంగా కలచివేస్తోందని పేర్కొన్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు.

ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనితతో మంత్రి సత్యకుమార్ ఫోన్‌లో మాట్లాడారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. రాజమహేంద్రవరం జిల్లా ఎస్పీతోనూ ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. వైద్య విద్యార్థులపై జరిగిన ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

# రెండేళ్లలో చివటం గ్రామాభివృద్ధికి రూ. 6.82 కోట్లు: మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని అందులో భాగంగానే గడిచిన రెండేళ్ల కాలంలో ఒక్క చివటం గ్రామాభివృద్ధికే రూ. 6.82 కోట్లు ఖర్చు చేశామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఉండ్రాజవరం మండలం చివటం గ్రామంలో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమం ద్వారా రూ. 1.20 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన రోడ్లను శుక్రవారం మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కందుల దుర్గేష్ ప్రసంగిస్తూ చివటం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సమగ్రంగా వివరించారు. చివటం గ్రామంలో పల్లె పండుగ 1.0 ద్వారా రూ. 13 లక్షలతో 2 పనులు, పల్లె పండుగ 2.0 ద్వారా రూ. 1.64 కోట్లతో 10 పనులు, రూ. 33.28 లక్షల పంచాయతీ నిధులు, రూ. 2.45 కోట్ల జల్ జీవన్ మిషన్ నిధులు, రూ. 10 లక్షల మండల ప్రజా పరిషత్ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ. 11.30 లక్షలతో 6 గోకులం షెడ్డులు, చివటం గ్రామం నుండి వడ్లూరు గ్రామం శివారు వరకు రూ. 30 లక్షల ఆర్ అండ్ బీ నిధులతో బీటీ రోడ్డు, రూ. 1.69 కోట్ల నాబార్డు నిధులతో గ్రామ పరిధి వరకు రోడ్డు వేయడం



జరిగిందన్నారు. అదే విధంగా 8 మంది లబ్ధిదారులకు రూ. 2.71 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్, రూ. 2.25 లక్షల విలువైన 2 ఎల్ వోసీ లెటర్లు అందించామన్నారు..

**30 ఏళ్లకు సరిపడా మన్నికైన సీసీ రోడ్లు:మంత్రి దుర్గేష్**

రాజకీయాల్లో ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడమే తమకు సంతృప్తినిస్తుందని మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. చివటంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అధ్వాన్నపు రహదారుల సమస్యను గ్రామస్థులు తన దృష్టికి తేగానే ఇచ్చిన మాట ప్రకారం రాబోయే 30 ఏళ్ల పాటు ఎటువంటి మరమ్మతులు అవసరం లేని విధంగా నాణ్యమైన సీసీ రోడ్లను నిర్మించామన్నారు. ఈ పనుల పూర్తికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నాటి కలెక్టర్ పి. ప్రశాంతి మరియు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బూరుగుపల్లి శేషారావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేసిన రోడ్డు తప్ప గత ప్రభుత్వం 2019-24 మధ్యకాలంలో ఒక్క కొత్త రోడ్డు కూడా వేయలేదని, కనీసం గుంతల్లో తట్టెడు మట్టి కూడా పోయలేని చేతకాని ప్రభుత్వంగా నిలిచిపోయిందని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ప్రత్యేక శ్రద్ధతో రోడ్ల నిర్మాణం చేపడుతోందని.. ఇందుకు సాయపడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర సహకారంతో, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ల నాయకత్వంలో 'సూపర్ సిక్స్' హామీలను 'సూపర్ డూపర్ హిట్' చేసి చూపామన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పుంత రోడ్లు, డ్రైన్లు, అంతర్గత రహదారులను కూడా క్రమక్రమంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**నిడదవోలుకు అత్యధికంగా రూ. 28 కోట్ల శాస్కి నిధులు:మంత్రి దుర్గేష్**

రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేని విధంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెద్ద మనసుతో నిడదవోలు నియోజకవర్గానికి అత్యధికంగా రూ. 28 కోట్ల 'శాస్కి' నిధులను మంజూరు చేశారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, సెప్టెంబర్ 15వ తేదీ నుండి నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో ఈ నిధులతో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉండ్రాజవరం మండలంలోనే దాదాపు 8 ప్రధాన పనులకు గాను రూ. 13 కోట్లు ఖర్చు చేయనున్నామని, త్వరలోనే శంకుస్థాపనలు చేపడతామని చెప్పారు.

రైతన్నలకు తోడుగా కూటమి ప్రభుత్వం - ఎల్ నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించిన మంత్రి దుర్గేష్..కేవలం 42 శాతమే వర్షపాతం.. వరికి బదులు ప్రత్యామ్నాయ, వాణిజ్య పంటలు వేయాలని సూచన.

ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పటివరకు సాధారణ వం-ర్షపాతంలో కేవలం 42 శాతం మాత్రమే నమోదైందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో నీటి ఎద్దడిని తట్టుకునేలా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా నీటి అవసరం తక్కువగా ఉండే వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల వైపే రైతులు మొగ్గు చూపాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేబినెట్ సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ మార్గదర్శకాలను రైతులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే జులై నెలలోనే నాట్లు వేయడం పూర్తయినందున, ఎదురవుతున్న సాగు ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం "రైతన్న మీ కోసం" అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక, సాగు సలహాలను అందిస్తుందన్నారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం..
# సంక్షేమం, అభివృద్ధే కూటమి పాలన లక్ష్యం





## ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తెనాలి నియోజకవర్గంలోని జగడిగుంటపాలెం ప్రగడ కోటయ్యనగర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలపాటికి ఘన స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మహిళలు సంతృప్తి వ్యక్తం చేస్తూ తమ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు.

ఇంటింటికీ వెళ్లిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజలను ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా తల్లికి వందనం, సామాజిక భద్రతా పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ప్రజల వద్దకే ప్రభుత్వం" అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. మహిళలు, రైతులు, పేదలు, వృద్ధులు, యువత సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆలపాటి తెలిపారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు ఈ ఇంటింటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తెనాలి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం అందుబాటులో ఉంటానని ఆలపాటి రాజేంద్రప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.





## ఆర్టీసీ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి



- **ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్‌కు ఆర్టీసీ జేఏసీ వినతి**

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఆర్టీసీ) ఉద్యోగుల హయ్యర్ పెన్షన్, ఈపీఎఫ్, ఈపీఎస్, పెండింగ్ పెన్షన్ క్లెయిమ్స్, పీఎఫ్ ఖాతాల బదిలీలు, సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బాలసుబ్రహ్మణ్యం, ఉన్నతాధికారులతో కలిసి జేఏసీ నాయకులు హైదరాబాద్ బర్కత్‌పురలోని ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ పి. శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి అనుగుణంగా అర్హులైన ప్రతి ఉద్యోగికి హయ్యర్ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 6 వేల మంది ఉద్యోగుల తిరస్కరించిన జాయింట్ ఆప్షన్ దరఖాస్తులను పునఃపరిశీలించాలని, వివిధ కారణాలతో సకాలంలో మొత్తాలు చెల్లించలేకపోయిన సుమారు 8 వేల మందికి వన్‌టైమ్ మెజర్ కింద మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2013, 2017 పీఆర్సీ వేతన సవరణలు, డీఏ పెంపులను పరిగణనలోకి తీసుకుని హయ్యర్ పెన్షన్ లెక్కించాలని, డబుల్ స్లాబ్ విధానం వల్ల ఉద్యోగులకు జరుగుతున్న పెన్షన్ నష్టాన్ని పునఃపరిశీలించాలని కోరారు. 1995 సెప్టెంబర్ 16 నుంచే హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగులకు, 2014 తర్వాత కూడా కాంట్రిబ్యూషన్ చెల్లించిన వారికి హయ్యర్ పెన్షన్ మంజూరు చేయాలని, 58 ఏళ్లు దాటిన ఉద్యోగుల క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని, ఈపీఎఫ్‌కు జమ చేసిన సుమారు రూ.35 కోట్ల కాంట్రిబ్యూషన్‌ను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

మరణించిన, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ క్లెయిమ్స్‌ను నెల రోజుల్లోగా పరిష్కరించాలని, పెండింగ్ పీఎఫ్ క్లెయిమ్స్, ఖాతాల బదిలీలు, హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు. సీపీఎస్ ఆప్షన్ ఎంచుకున్న ఉద్యోగులకు ఈపీఎస్‌లో జమ అయిన మొత్తాలను చెల్లించాలని, ఏపీఎస్ఆర్టీసీకి సంబంధించిన పీఎఫ్ కోడ్‌ను నిబంధనల ప్రకారం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ వినతిపై ఈపీఎఫ్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, నిబంధనల మేరకు అంశాలను పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఉద్యోగుల హక్కులు పరిష్కారమయ్యే వరకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## జాబ్ చార్ట్ అమలులో నిర్లక్ష్యానికి ఆస్కారం ఇవ్వకూడదు



- **వృత్తిపట్ల నిబద్ధత ఉండాలి**
- **క్రమశిక్షణతో పనిచేయాలి**
- **నూతన ఆయుష్ వైద్యులకు డైరెక్టర్ రోణంకి గోపాల్ కృష్ణ**

విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్): నూతనంగా విధుల్లో చేరిన ఆయుష్ వైద్యులు ప్రజాసేవనే పరమావధిగా భావించి, వృత్తిపట్ల పూర్తి నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాల్ కృష్ణ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించడంతో పాటు ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన హోమియో, యునానీ వైద్యులకు విజయవాడ ఆటోనగర్‌లోని ఆయుష్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం రెండో రోజు ఆయన మాట్లాడారు. నూతన వైద్యులకు విధులు, బాధ్యతలు, జాబ్ చార్ట్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడం ప్రతి వైద్యుడి బాధ్యత అని చెప్పారు. జాబ్ చార్ట్‌లో నిర్దేశించిన విధులను తప్పనిసరిగా పాటిస్తూ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సూచించారు.

## ప్రతి ఔషధ తనిఖీ.. రోగి భద్రత కోసమే !

- **నాణ్యమైన మందులే ప్రజారోగ్యానికి రక్షణ**
- **విధివిధానాల అమలు, ప్రయోగశాల నియంత్రణలో పటిష్ఠత అవసరం**
- **యూఎస్ ఎఫ్‌డీఏ ఇండియా కార్యాలయం కంట్రీ డైరెక్టర్ గ్రెగరీ స్మిత్**



విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్): ఔషధ తయారీ సంస్థల్లో జరిగే ప్రతి తనిఖీ, ప్రయోగశాల పరీక్ష, నియంత్రణ సంస్థలు తీసుకునే ప్రతి నిర్ణయం నేరుగా రోగుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఇండియా కార్యాలయం (యూఎస్ ఎఫ్‌డీఏ ఇండియా ఆఫీస్) కంట్రీ డైరెక్టర్ గ్రెగరీ స్మిత్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యాన్ని కాపాడాలంటే శాస్త్రీయ విధానాలు, అంతర్జాతీయ సహకారం, నాణ్యమైన తనిఖీ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని చెప్పారు. రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన (ఏపీ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) ఆధ్వర్యంలో అమెరికా ఫార్మకోపియా (యూఎస్‌పీ), ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ సహకారంతో విజయవాడలో శుక్రవారం "నాణ్యమైన ఔషధాల భరోసా.. నియంత్రణ, ప్రమాణాలు, తనిఖీల్లో శాస్త్రీయ విధానం" అంశంపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

**భారత్ కీలక భాగస్వామి.... :** అమెరికా ఎఫ్‌డీఏ పర్యవేక్షణలో ఉన్న ఔషధ తయారీ కేంద్రాల్లో సగానికి పైగా అమెరికా వెలుపలే ఉన్నాయని, అందులో భారత్ అత్యంత కీలక భాగస్వామి అని గ్రెగరీ స్మిత్ తెలిపారు. అమెరికాకు ఎగుమతి అయ్యే మందుల తయారీలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్‌డీఏ) ఆమోదం పొందిన 119 ఔషధ తయారీ కేంద్రాలు ఉండటం ఏపీ ఫార్మా రంగ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**లోపాలపై అప్రమత్తంగా ఉండాలి :** అమెరికా ఎఫ్‌డీఏ తనిఖీల్లో సాధారణంగా విధివిధానాలను సరిగా రూపొందించకపోవడం లేదా పాటించకపోవడం, లోపాలపై సమగ్ర విచారణ జరపకపోవడం, ప్రయోగశాల నియంత్రణల్లో బలహీనతలు కనిపిస్తున్నాయని గ్రెగరీ స్మిత్ తెలిపారు. ఇవి ఔషధ నాణ్యతను ప్రభావితం చేసే కీలక అంశాలని, తనిఖీల్లో శాస్త్రీయ ప్రమాణాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**నాణ్యతపై రాజీ లేదు: వీరపాండియన్ :** వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడుతూ, వ్యాపార నిర్వహణ సులభతరం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) కోసం నిబంధనలను సరళీకరిస్తున్నప్పటికీ, మందుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే ఔషధాలు ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్నందున ఔషధ నియంత్రణ అధికారుల బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఔషధ తయారీ సంస్థల తనిఖీలు, ఉత్పత్తుల ప్రమాణాల పరిశీలన, ముడి పదార్థాల ధ్రువీకరణ, శాస్త్రీయ ఆధారాలతో నియంత్రణ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అధికారులు మరింత పెంపొందించుకోవాలని సూచించారు. నాణ్యమైన మందులు తయారుచేసే సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, నాసిరకం మందుల విషయంలో మాత్రం 'జీరో టాలరెన్స్' విధానమే అమలు చేస్తామని స్పష్టం చేశారు.

ఏపీ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎం. పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ, సవరించిన పాలు తయారీ సంస్థ ప్రమాణాలు షెడ్యూల్-ఎం అమలుకు అవసరమైన నైపుణ్యాన్ని అధికారులకు అందించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, వివిధ హోదాల్లోని ప్రభుత్వ అధికారులు ఈ హాజరయ్యారు.

## ఎస్కేయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలి



అనంతపురం(జర్నలిస్ట్ ఫైల్): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆయనను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఎన్నో సంవత్సరాలుగా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా సేవలందిస్తున్నప్పటికీ మినిమం టైమ్ స్కేల్ అమలు కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వివరించారు. తమకు సమాన పనికి సమాన వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నల్లపల్లి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మినిమం టైమ్ స్కేల్ మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

## సుద్దముక్కపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి దుర్గేష్ పేర్లతో అద్భుత కళాఖండం



- **ఆర్టిస్ట్ కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు మైక్రో ఆర్ట్‌ను అభినందించిన మంత్రి కందుల దుర్గేష్**
- **చివటం గ్రామ మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి మంత్రి దుర్గేష్ హామీ**


నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్): నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం చివటం గ్రామంలో శుక్రవారం పర్యటించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ప్రముఖ మైక్రో ఆర్టిస్ట్ కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ చేనేత దినోత్సవం మరియు 'పల్లె పండుగ 2.0' కార్యక్రమాల సందర్భాన్ని పురస్కరించుకుని సుద్దముక్కపై "కందుల దుర్గేష్", "డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్", "రాష్ట్ర చేనేత దినోత్సవం", "పల్లె పండుగ" అనే నాలుగు పేర్లను సూక్ష్మ కళారీతిలో అత్యంత అద్భుతంగా చెక్కి మంత్రి దుర్గేష్ కు బహుకరించారు. ఈ సందర్భంగా సభా వేదికపై నాగ సూర్య రాఘవేంద్ర బాబును ప్రత్యేకంగా ఆహ్వానించి ఆయనలోని అసాధారణ మైక్రో ఆర్ట్ నైపుణ్యాన్ని అభినందించి సత్కరించారు.

**సొసైటీ భవనం సందర్శన:**

అనంతరం గ్రామ పర్యటనలో భాగంగా చివటం గ్రామంలో జనాభా మరియు విస్తీర్ణం గణనీయంగా పెరగడం వల్ల గతంలో ఊరి బయట ఉన్న డంపింగ్ యార్డ్ ప్రస్తుతం గ్రామం మధ్యలోకి వచ్చేసిందని, దీనివల్ల దుర్గంధం, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజలు మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన మంత్రి కందుల దుర్గేష్, అధికారులతో కలిసి డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామస్థుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం తమకు ముఖ్యమని, త్వరలోనే డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల చివటం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) భవనాన్ని మంత్రి దుర్గేష్ సందర్శించారు. సొసైటీ ద్వారా రైతులకు అందుతున్న రుణాలు, ఎరువులు మరియు ఇతర సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతాంగానికి నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

# ఆపదలో అండగా ఎమ్మెల్సీ ఆలపాటి..

## 53 మందికి రూ.22.98 లక్షల సీఎంఆర్‌ఎఫ్ సాయం


తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): తెనాలి నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎమ్మెల్సీ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అండగా నిలిచారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం కోరిన 53 మంది కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.22,97,828 మంజూరు చేయించడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన మొత్తానికి సంబంధించిన చెక్కులను శుక్రవారం ఆలపాటి రాజేంద్రప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ఆయన కృషి చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాల సమస్యలను తెలుసుకుని, వారి తరఫున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి సాయం అందేలా చూడటంలో ఆలపాటి చొరవ చూపారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు కష్టకాలంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అన్నారు. నియోజకవర్గంలో వైద్య చికిత్స అవసరమైన అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అనేక కుటుంబాలకు వైద్యపరంగా ఆర్థిక భరోసా కలుగుతోందన్నారు.

ఆర్థిక సాయం అందుకున్న కుటుంబ సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని సీఎంఆర్‌ఎఫ్ సాయం అందేలా చొరవ తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్, నల్లిబోయిన నాగేశ్వరరావు, భీమవరపు చినకోటి రెడ్డి, మంగమూరి హరిప్రసాద్, పసుపులేటి త్రిమూర్తి, వంగా సాంబిరెడ్డి, కేసన కోటేశ్వరరావు, వసంతం అశోకవర్ధన్, మల్లవరపు విజయ్, జొన్నాదుల మహేష్, ఈదర వెంకట పూర్ణచంద్, కాటం రవి, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, అర్జున్, కన్నయ్య, షావుల్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.




# కేజీబీవీ విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన

- 'సురక్షా కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ' ప్రచారంలో భాగంగా కడ్తాల్ పోలీసుల ప్రత్యేక కార్యక్రమం
- స్టాక్ ట్రేడింగ్,ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన



కడ్తాల్ ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : స్వాతంత్ర్య మాసోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ" అవగాహన కార్యక్రమంలో భాగంగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం కడ్తాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్,పెట్రో మొబైల్ సిబ్బంది పాల్గొని విద్యార్థి నులు, ఉపాధ్యాయులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న స్టాక్ ట్రేడింగ్,ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, నకిలీ లింకులు,ఫేక్ యాప్‌లు,సోషల్ మీడియా మోసాల గురించి విద్యార్థులకు వివరించారు.అలాగే "త్రివర్ణ సైబర్ భద్రతా నియ మాలు" పేరిట మూడు ముఖ్యమైన సూచనలను వివరిం చారు. కాషాయం రంగు అప్రమత్తతకు ప్రతీకగా అనుమానాస్పద లింకులు, ఆకర్షణీయమైన ఆన్‌లైన్ ఆఫర్లను నమ్మవద్దని సూచిం చారు. తెలుపు రంగు అవగాహనకు ప్రతీకగా ఏ సమాచారం వచ్చినా ముందుగా ధృవీకరించుకుని బాధ్యతా యుతమైన డిజిటల్ ప్రవర్తన పాటించాలని చెప్పారు. ఆకుపచ్చ రంగు భద్రతకు ప్రతీకగా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్లు, మీవ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డిజిటల్ పరిశుభ్రత,సైబర్ భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు వివరించడంతో పాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) రూపొందించిన అవగాహన పోస్టర్లను ప్రదర్శించి పంపిణీ చేశారు.సైబర్ మోసాలకు గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని,అలాగే cybercrime. gov.in ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా కడ్తాల్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు, యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, సందేశాలు,పెట్టుబడుల ఆఫర్లు, పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దని, ఏవైనా అనుమానాస్పద ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ పోచమ్మ దేవి ఐదవ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న బాలింగ్ గౌతమ్ గౌడ్



శేరిలింగంపల్లి ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : హఫీజ్‌పేట్ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీలోని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ దేవి అమ్మవారి ఆలయ ఐదవ వార్షికోత్సవం, కళ్యాణ మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈఆధ్యాత్మిక వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, కాలనీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు బాలింగ్ గౌతమ్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో కాలనీకి చెందిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలు చిరస్మరణీయం

కాప్రా మున్సిపల్ కార్యాలయంలో ఘన నివాళి



కాప్రా, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా కాప్రా మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాప్రా డిప్యూటీ కమిషనర్ వీరేంద్ర సాగర్, నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్‌తో పాటు ఇతర అధికారులు ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుల్లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ అగ్రగణ్యులని కొనియాడారు. స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో చైతన్యవంతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆలోచనలు, ఆశయాలు స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ సార్ బోధించిన విలువలు, ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, ఆయన సేవలను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## ఆచార్య జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం: కుమ్మరి రాజు



మల్కాజ్‌గిరి ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోని గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని వీధి నెం.28లో ఉన్న ఆయన విగ్రహానికి వివేకానంద మానవసేవే మాధవసేవ గ్రూప్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రూప్ అధ్యక్షుడు కుమ్మరి రాజు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసిన జన్మ బ్రహ్మచారి ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ అని పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంతో పాటు ముల్కీ ఉద్యమం, "సాంబార్-ఇడ్లీ గో బ్యాక్" ఉద్యమాల్లోనూ చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు.ఆచార్యజయశంకర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో ఇస్తారి,మనోహర్, తుపాకులరమేష్, సత్యనారాయణ, లచ్చయ్య పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఘన నివాళి



సైబరాబాద్, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయ శంకర్ జయంతి సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన కృషి, ఆయన సిద్ధాంతాలు, ప్రజల పట్ల చూపిన అంకితభావం సమాజానికి ఆదర్శమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగం ఉప పోలీస్ కమిషనర్ అన్నపూర్ణ, నేరాల విభాగం ఉప పోలీస్ కమిషనర్ ముత్యం రెడ్డి, కేంద్ర రిజర్వు ప్రధాన కార్యాలయ ఉప పోలీస్ కమిషనర్ సంజీవ్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

## సైధోనీ గడ్డ తండలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

- పాల్గొన్న జిల్లా బీజేపీ నాయకులు
- సంప్రదాయాల పరిరక్షణతోనే సమాజ అభివృద్ధి
- ప్రకృతి ఆరాధన, కుటుంబ శ్రేయస్సు కోసం భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర ఉత్సవం..



మేడ్చల్, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని సైదుని తండలో లంబాడీ సోదరుల అత్యంత పవిత్రమైన సంప్రదాయ పండుగ అయిన తీజ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు రమేష్ నాయక్, జీవన్ నాయక్ గార్ల ప్రత్యేక ఆహ్వానం మేరకు లిమేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, లిమేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొని లంబాడీ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి గారు మాట్లాడుతూ, "తీజ్ పండుగ లంబాడీ సమాజం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. ప్రకృతిని ఆరాధిస్తూ, కుటుంబ శ్రేయస్సు, పంటల సమృద్ధి, సమాజ శాంతి కోసం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవడం ఎంతో విశిష్టమైన సంప్రదాయం. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. లంబాడీ సమాజం తమ ఆచారాలను, సంస్కృతిని కాపాడుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ గిరిజనుల అభ్యున్నతి, వారి సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి ,కౌన్సిలర్లు అర్చన శ్రీనివాస్ ముదిరాజ్, మహేశ్వరి రాజేష్, శారదా రాజు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు జగన్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు జమ్మల ప్రభాకర్ రెడ్డి,తండ పెద్దలు, మహిళలు, యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ విజయవంతం

- ప్రతి నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు: వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్

శేర్లింగంపల్లి, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి సుమారు వెయ్యి ఐదు వందల మంది నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివెళ్లి సభను విజయవంతం చేశారని శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ బాధ్యుడు వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలకు నిజమైన సామాజిక న్యాయం అందించగలిగేది తెలంగాణ రక్షణ సేన పార్టీయేనని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, మహిళలు, నిరుద్యోగ యువత, రైతుల హక్కుల పరిరక్షణకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులు, ఇంకా సాధించాల్సిన లక్ష్యాలను ప్రజలకు వివరించడంతో పాటు సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా సామాజిక న్యాయ పోరాటాన్ని మరింత బలోపేతం చేయడానికే ఈ సంకల్ప సభను నిర్వహించామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనభై సంవత్సరాలు గడిచినా విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రతి గ్రామంలో, హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ఆచార్య జయశంకర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాలో సామాజిక న్యాయ తెలంగాణపై సమావేశాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. అలాగే సంక్రాంతి అనంతరం వేలాది మంది కార్యకర్తలతో సామాజిక న్యాయం కోసం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో



అస్లాం, దయానంద్, కుమార్, విష్ణు, మురుగేసన్, ప్రవీణ్, సూర్యప్రకాశ్, యాదగిరి, రాంభూపాల్ రెడ్డి, స్వామి గౌడ్, వలి, చందు, అసిఫ్, లక్ష్మి, మాధవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభను విజయవంతం చేసిన శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




## ఈఆర్వో నారాయణ్ అమిత్ ఐఏఎస్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో సర్వపక్ష సమావేశం

- ఆగస్టు 10తో ముగియనున్న ఎస్ఐఆర్ గడువుపై సమీక్ష

శేరిలింగంపల్లి ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) మరియు జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్ ఆధ్వర్యంలో గురువారం శేరిలింగంపల్లి జోన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్వపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఏఈఆర్వోలు) హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈనెల ఆగస్టు 10తో ఎస్ఐఆర్ గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి, గడువులోపు పూర్తి చేయాలని ఈఆర్వో నారాయణ్ అమిత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పలు సూచనలు, సలహాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన ఈఆర్వో నారాయణ్ అమిత్, రాజకీయ పార్టీల నుంచి వచ్చిన సూచనలను సానుకూలంగా పరిశీలించి, పారదర్శకంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఎలాంటి లోపాలు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఆత్మహత్యలు లేని సమాజమే మా లక్ష్యం

- ఆత్మహత్యల నివారణ కోసం నిరంతరం కృషి చేస్తున్న సంస్థ" రోష్ని"
- హెల్ప్ లైన్ నెంబర్:8142020033,8142020044 040-66202000,040-66202001



రాంగోపాల్ పేట్, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : సమాజంలో పెరుగుతున్న ఆత్మహత్యలను నివారించేందుకు" రోష్ని" స్వచ్ఛంద సంస్థ నిరంతరం కృషి చేస్తోందని సీనియర్ వాలెంటీర్స్ రత్నా, స్వర్ణలు చెప్పారు. మానసిక ఒత్తిడి,డిప్రెషన్‌తో సతమతమవుతున్న వారికి హెల్ప్ లైన్ ద్వారా కౌన్సెలింగ్ అందిస్తోంది. శిక్షణ పొందిన సైకాలజిస్టులు,వాలంటీర్లు ఫోన్ ద్వారా బాధితులతో మాట్లాడి ధైర్యం నింపుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు,కార్పొరేట్ సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు"నువ్వు ఒంటరివి కాదు" అనే నినాదంతో ఆత్మహత్య ఆలోచనలు వచ్చిన వారిని ఆత్మహత్యలు చేసుకోకుండా వారిని ఆదుకుంటోంది. ఇప్పటివరకు వేలాది మందికి ఉచితంగా కౌన్సెలింగ్ సేవలు అందించి,అనేక మంది ప్రాణాలను కాపాడినట్లు వారి గణాంకాలు చెబుతున్నాయి.సంస్థ సేవలు పూర్తిగా లిగోప్యం గా, ఉచితంగాలి ఉంటాయని వాలంటీర్లు స్పష్టం చేశారు.ఆత్మహత్యలపై ఉన్న సామాజిక సిగ్మాను తొలగించేందుకు అవగాహన ర్యాలీలు, సెమినార్లు నిర్వహిస్తోంది.బాధితుల కుటుంబాలకు కూడా పోస్ట్-వెన్షన్ సపోర్ట్ అందిస్తోంది.రోషిణి స్వచంద సంస్థ -ఆత్మహత్య చేసుకోవాలని అనుకుని... దానిని అవాయిడ్ చేసేంతగా ఆశాజ్యోతిలి గా నిలిచి సమాజానికి దిక్సూచిగా మారుతుంది. తమ హెల్ప్ లైన్ నెంబర్లను 8142020033, 8142020044 040-66202000,040-66202001, సంప్రదించాలని చెప్పారు.

## సికింద్రాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయం వద్ద కిలోమీటర్ మేర క్యూ



కంటోన్మెంట్, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : సికింద్రాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయం వద్ద పాస్పోర్ట్ దరఖాస్తుదారులు గురువారం బారులు తీరారు.విదేశాలకు వెళ్లాలనుకునే వారికి పాస్పోర్టు తప్పనిసరి అని తెలిసిందే. పాస్పోర్ట్‌కు అప్లై చేసి వివిధ గ్రామాల వల్ల దరఖాస్తు చేయబడి తిరస్కరణకు గురైనవారు. వారి ధ్రువపత్రాలతో వెరీ వెరిఫికేషన్కు పాస్పోర్ట్ కారడానికి వచ్చారు.గత 10,12 సంవత్సరాల్లో ఇలా పాస్వర్డ్ కార్యక్రమం వద్ద బారులు తీరడం మొదటిసారి.

## అందరి సహకారంతో మహంకాళి జాతర విజయవంతం

- ఆలయ ఈవో, పాలక మండలి



రాంగోపాల్ పేట్, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : అందరి సహకారంతో మహంకాళి బోనాల జాతర విజయవంతమైందని ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి,ట్రస్టు బోర్డు సభ్యులు అన్నారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.గత సంవత్సరం జాతరకు వచ్చిన భక్తులకు మూడు రెట్లు ఈ సంవత్సరం వచ్చారని చెప్పారు.అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని చెప్తూ.... సిఎం రేవంత్ రెడ్డి,మంత్రులు కొండ సురేఖ,పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డా కోట నీలిమ సహకారంతో జాతరలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.ఈ సందర్భంగా ఆలయ ఈవో ను ట్రస్టు బోర్డు సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి,ట్రస్టు బోర్డు సభ్యులు రామతీర్థం శర్మ,చెక్కల రాజేందర్,గుండెల్లి దేవి రవప్రసాద్,రాకేష్ అగర్వాల్,శివలాల్,శ్రీకాంత్,రమేష్, భాస్కర్ గుప్తా,హేమంత్ సింగ్,సోనాలి తదితరులు పాల్గొన్నారు.

## షేక్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి, ఇద్దరు తీవ్రంగా గాయాలు..
- మైనర్ డ్రైవర్ కేసులో వాహన యజమాని అరెస్ట్



శేరిలింగంపల్లి, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) : రైదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని షేక్‌పేట్ ఫ్లైఓవర్ కింద రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి రైదుర్గం పోలీసులు క్రైమ్ నెం. 849/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 106(1), 125(ఎ) మరియు మోటార్ వెహికల్ యాక్ట్ సెక్షన్లు 180, 181 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, ఆగస్టు 1వ తేదీ అర్ధరాత్రి సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుదీప్త దాస్ (26), సౌమెన్ రాయ్ (27), అవిజిత్ రే (26) ముగ్గురు రైదుర్గంలోని పోచమ్మ బస్తీలో నివాసముంటూ రోడ్డు దాటుతుండగా, మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న AP31AY1551 నంబర్ కారును ఒక మైనర్ బాలుడు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి వారిని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుదీప్త దాస్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సౌమెన్ రాయ్ తలకు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతుండగా, అవిజిత్ రే కుడికాలు విరగడంతో చికిత్స కొనసాగుతోంది. మృతుడి రూమ్‌మేట్ సౌరవ్ సంత్రా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో వాహనాన్ని 16 ఏళ్ల మైనర్ బాలుడు నడిపినట్లు గుర్తించారు. అతనితో పాటు కారులో మరో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నట్లు తేలింది. వాహనాన్ని మైనర్‌కు నడిపేందుకు అనుమతించినందుకు వాహన యజమాని, మైనర్ తండ్రి లిలిమహమ్మద్ ఇమాదుద్దీన్ (48)లిలిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు రైదుర్గం ఇన్‌స్పెక్టర్ టి. భూపతి తెలిపారు.

# తలకొండపల్లి నుండి 'చలో సరూర్ నగర్'కు కదిలిన తెరాస శ్రేణులు

- తెరాస మండల అధ్యక్షుడు వద్దే సాయి

**తలకొండపల్లి, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**



సమాన హక్కులు – సమాన అవకాశాలే లక్ష్యంగా సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"కు తలకొండపల్లి మండల తెరాస శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. తెరాస నాయకురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు మండల యువజన విభాగం అధ్యక్షుడు వద్దే సాయి మరియు (రామ్ సుల్తాన్) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గురువారం తలకొండపల్లి నుంచి సరూర్ నగర్ కు బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వద్దే సాయి మాట్లాడుతూ..సామాజిక న్యాయ తెలంగాణ సాధనే ధ్యేయంగా ఈ సంకల్ప సభను విజయవంతం చేయడానికి తరలివెళ్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెరాస కల్వకుర్తి ఇన్చార్జి రవి రాథోడ్, ముఖ్య నాయకులు ఆంజనేయులు,శ్రీను,అంజి,లక్ష్మణ్,వెంకటయ్య, మల్లయ్య, సాయిలు,హనుమాన్,జంగయ్య తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ స్ఫూర్తి ప్రదాత జయశంకర్



**ఖమ్మం, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ తనదైన మేధస్సుతో తొలి మలిదశ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఎస్ఆర్ బిజిఎన్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా పేర్కొన్నారు.గురువారం ఆచార్య జయశంకర్92 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా దార్శనిక మార్గాన్ని స్మరించుకున్నారు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి,ఐ.క్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.సునంద,ఏ.ఓ ఉమ, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అధ్యాపకులు డా.లక్ష్మణరావు,డా.పిచ్చయ్య,డా.వై.రవివర్ధన్,ధర్మయ్య ఎం వి.రమణ,అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతినికేతన్ లో హరితహారం






**సదాశివపేట, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

సదాశివపేట పట్టణం నందు శాంతినికేతన్ విద్యాలయంలో విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల కరస్పాండెంట్ మాలి పటేల్ అరవిందశ్రీ ప్రిన్సిపాల్ సుప్రియ ఆధ్వర్యంలో హరితహారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కరస్పాండెంట్ అరవిందశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరం ఒక చెట్టు నాటి వర్షపాతాన్ని పెంపొందించాలి అని అన్నారు .వర్షాలు మంచిగా కురిస్తేనే పంటలు పండుతాయి పంటలు పండితే రైతు సంతోషంగా ఉంటాడు రైతు సంతోషంగా ఉంటే దేశం సంతోషంగా ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరం కూడా పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరి జన్మదినం రోజు ఒకటి లేదా రెండు చెట్లు నాటి పర్యావ రక్షణ పరిరక్షణ కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు వృక్షాకారంలో కూర్చుని చెట్లు నాటాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రజావాణి ధరఖాస్తులకు విశేష స్పందన : నూతి

**ఖమ్మం, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**



జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ప్రతి గురువారం ప్రజావాణి ప్రక్రియలో భాగంగా 15 వ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలలనుండి ప్రజలు సమస్యలతో వస్తున్నారని, దరఖాస్తుల ద్వారా సమస్యలను తెలుపుతున్నారని, అట్టి దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు ద్వారా పరిష్కరి స్తున్నామని,కొన్నిటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తున్నామని, ఈరోజు 18 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహారావు,కిలారు అనిల్ కుమార్, మూడు ముంతల గంగరాజు యాదవ్, కొట్టే రాజశేఖర్, బండి మాధవరావు, నాయిని సునీత, దామా స్వరూప, పాటి నర్సయ్య,టి పి సి సి యస్ సి సెల్ వైస్ చైర్మన్ దర్శి చెన్నారావు, పుచ్చకాయల సోమిరెడ్డి, గోవిందు శ్రీను ,హలావత్ అర్జున్,గంగిశెట్టి ప్రసాద్, బ్రహ్మారెడ్డి,మర్సకట్ల బాబు,కిలారు వెంకటరమణ,గజ్జి సూర్యనారాయణ, అజ్గర్,పురుషోత్తం , మహమూద్,పంది రాజు గౌడ్ , ఫరీద్ ఖాద్రి ,తదితర నాయకులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక విద్యా పర్యటనలో యస్.బి.ఐ.టి. విద్యార్థులు

**ఖమ్మం, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**



విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, స్టార్టప్ వ్యవస్థ, ఇంక్యుబేషన్, హ్యాకథాన్‌లు, ఐడియాథాన్‌లపై అవగాహన కల్పించే లక్ష్యంతో తమ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రముఖ ఆవిష్కరణ కేంద్రాలైన ఉయ్-హబ్, టి-హబ్, టి-వర్క్స్‌లను పారిశ్రామిక విద్యా పర్యటనలో భాగంగా సందర్శించారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల నిపుణులు విద్యార్థులకు స్టార్టప్‌ల స్థాపన, ఇంక్యుబేషన్ ప్రక్రియ, వినూత్న ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచే విధానం, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. హ్యాకథాన్‌లు, ఐడియాథాన్‌లు విద్యార్థుల సమస్య పరిష్కార సామర్థ్యాన్ని, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. టి-వర్క్స్ లో అత్యాధునిక ప్రోటోటైపింగ్ సదుపాయాలు, డిజైన్, తయారీ సాంకేతికతలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కళాశాల వైస్-ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ ఉయ్-హబ్‌లో మహిళా పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాల గురించి తెలుసుకోగా, టి-హబ్‌లో స్టార్టప్‌ల అభివృద్ధి, మెంటరింగ్, పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి ఇంక్యుబేషన్ విధానాలపై విద్యార్థులు సమగ్ర అవగాహన పొందారని తెలిపారు. ఈ పారిశ్రామిక విద్యా పర్యటన ద్వారా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకత (ఎంట్రప్రెన్యూవర్షిప్), పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం పట్ల మరింత ఆసక్తిని పెంపొందించుకున్నారని, భవిష్యత్తులో హ్యాకథాన్‌లు, ఐడియాథాన్‌లు, స్టార్టప్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, ఇన్నోవేషన్ సెల్ ఇన్‌ఛార్జ్ పి. అశ్విని, టి.పి.ఒ. డాక్టర్ యన్. సవిత తదితరులు పాల్గొన్నారు.

# చైతన్య పరిచిన ప్రజా చైతన్య యాత్ర

- ఎర్రజెండాల రెపరెపల మధ్య ఖమ్మం రూరల్‌లో ఉత్సాహంగా ప్రారంభం
- తల్లంపాడు నుంచి పొన్నెకల్లు వరకు కదం తొక్కిన కామ్రేడ్స్
- ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగిన సిపిఐ పాదయాత్ర




**ఖమ్మం, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**

"బదలావ్ జరూరి హై, మార్పు కావాలి" అనే నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఖమ్మం రూరల్ మండలంలో గురువారం ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. ఎర్రజెండాల రెపరెపలు, విప్లవ నినాదాలు, డప్పుల మోగింపులతో తల్లంపాడు గ్రామం చైతన్య వేదికగా మారింది.తల్లంపాడు వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ యాత్రకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు డప్పు కొట్టి శ్రీకారం చుట్టగా, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఎర్రజెండాలను చేతబట్టి కామ్రేడ్స్ క్రమశిక్షణతో హైవేపై ముందుకు సాగుతూ ప్రజల్లో చైతన్యాన్ని నింపారు.యాత్ర తల్లంపాడు నుంచి పొన్నెకల్లు వరకు సాగుతూ దారిపొడవునా గ్రామ ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, ఇబ్బందులు, స్థానిక అవసరాలను తెలుసుకుంది. ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని సిపిఐ నాయకులు హామీ ఇచ్చారు.ఈ ప్రజా చైతన్య యాత్ర మద్దులపల్లి, వరంగల్ క్రాస్ రోడ్డు, పెద్దతండా, నాయుడుపేట, చిన్నతండా, తాళ్లేసి తండా, ఎదులాపురం, గొల్లగూడెం, ముత్తగూడెం గ్రామాల మీదుగా కొనసాగింది. అనంతరం రెడ్డిపల్లి, ఎం. వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, కసన తండా, తనగంపాడు, తీర్థాల, కామంచికల్లు, రామన్నపేట మీదుగా దానవాయిగూడెం వరకు పాదయాత్ర కొనసాగనుంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, సామాన్య ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే ధ్యేయంగా సాగుతున్న ఈ యాత్రకు గ్రామాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అలాగే కళాకారులు పాడిన పాటలు ఆడిన ఆట ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి . విప్లవ నినాదాలతో మారుమోగిన ఈ పాదయాత్ర ఖమ్మం రూరల్‌లో రాజకీయ, సామాజిక చైతన్యానికి కొత్త ఊపునిచ్చిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# కోటి రూపాయల నిధులతో 5వ వార్డుకు కొత్త ఊపు

**వైరా, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5th వార్డులో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చొరవతో మున్సిపాలిటీ నిధుల నుంచిరూ.1కోటిమంజూరుకాగా, ఆ నిధులతో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ నేపథ్యంలో వార్డు సంబంధిత అధికారులతో కలిసి ప్రతిపాదిత డ్రైనేజీ నిర్మాణ ప్రాంతాలను పరిశీలించి, అవసరమైన కొలతలను సేకరించారు. పనులు నాణ్యతతో, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా , ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఆయన చొరవతో ఐదవ వార్డుకు రూ.1 కోటి నిధులు మంజూరయ్యాయని, వాటితో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు.అలాగే వార్డును పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్ది అన్ని మౌలిక సదుపాయాలతో ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇట్టి కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి శ్రీనివాస రావు కొప్పురావూరి శబరినాథ్ , తాటికొండ రాము, రంగ సాయి కమల్ , దోనోజు సుబ్బారావు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కట్టుబడి ఉండాలి

**మంథని, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయ శంకర్ 92వ జయంతి వేడుకలను గురువారం మంథని పట్టణం లోని బొక్కలవాగు బ్రిడ్జి వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జయశంకర్ విగ్రహా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేల్పుల గట్టయ్య, మంథని విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ఆచార్య జయశం కర్ జీవితాంతం అంకితభావంతో కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనను జీవిత లక్ష్యంగా మార్చుకుని, నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో జరిగిన అన్యాయాన్ని శాస్త్రీయ ఆధారాలతో దేశానికి చాటిచెప్పిన మహోన్నత మేధావి జయశంకర్ అని కొనియాడారు.తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని అందించిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచా రని, భావజాలానికి రాజకీయ రూపం కల్పించి తెలంగాణ రాష్ట్ర సాధనకు మార్గదర్శకుడిగా వ్యవహరించారని అన్నారు. ఆయన ఆశ యాలను భావితరాలకు చేరవేసి, సమాజ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి తెలంగాణ వాది బాధ్యత అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో వర్ధిల్లు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు కొండేలా మారుతి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, సీనియర్



ఉద్యమ నాయకులు రామడుగు మారుతి, ముస్కుల ప్రభాకర్ రెడ్డి, మంథని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# శిశు ఆరోగ్యానికి తల్లిపాలే ఉత్తమ పోషణ

**మంథని, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**



మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తోట పోచయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అమూల్యమైన వరమని అన్నారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా శిశువుకు రోగనిరో ధక శక్తి పెరుగుతుందని, ప్రతి తల్లి తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే అందించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వ ఆరోగ్య, పోషకాహార సేవలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడి టీచర్ చంద్రకళ మాట్లాడుతూ... తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారమని, ఆరు నెలల వరకు ఇతర ఆహారం లేదా నీరు ఇవ్వాల్సిన అవసరం లేదని వివరించారు. అనంతరం ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన పౌష్టికాహారం అందించా లని సూచించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పరిశుభ్రత పాటిస్తూ పిల్లల ఎదుగుదలను ప్రతి నెల అంగన్వాడి కేంద్రంలో పర్యవే క్షించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి హెల్పర్ మదనక్క, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. అలాగే పోషకాహారం, తల్లి–శిశు ఆరోగ్య సంరక్షణ, సమతుల్య ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సర్పంచులదే : గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**



వికారాబాద్: జిల్లా అభివృద్ధి వేగవంతం కావాలంటే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి వాటిని ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత సర్పంచులదేనని తెలంగాణ శాసనసభాపతి, వికారా బాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు కీలక సూచనలు చేశారు.మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారం, శాఖల వారీ సమస్యలు, అవసరమైన పనుల వివ రాలతో హాజరుకావాలని సూచించారు. ప్రజల సమస్యల పరి ష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలు ఫోన్ చేసినప్పుడు అధికారులు తప్పనిసరిగా స్పందించి అందుబాటులో ఉండాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, సంక్షేమ రంగాలకు భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి మండలంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, బస్సు రవాణా సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా రూ.కోటి నిధులు కేటాయించామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రాధాన్యంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.90 కోట్ల నిధులు తీసుకువచ్చామని, ఫోర్‌లైన్ రహదారి పనులకు వేగం వచ్చిందని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి మండలానికి బీటీ రహదారులు ఏర్పాటు చేయడం తన బాధ్యత అని చెప్పారు. వికారాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందిం చేందుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీటిని తీసు కురావాలని ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందిం చారని, జిల్లాకు సాగు, తాగునీరు అందించే బాధ్యతను తాను తీసుకుంటానని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సర్పంచులు, వార్డు సభ్యులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతిని ధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగా హన కల్పించాలని సూచించారు. మంచినీరు, విద్యుత్, పాత భవనాలు, ఆరోగ్య సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహర మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలోపేతానికి అన్ని శాఖల సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాల నియంత్రణకు తోడ్పడుతుందని అన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రావు, జడ్పీ సీఈఓ సుధీర్, ఎంపీడీవో వినయ్ కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం లో ఘనంగా గద్దర్, ఖాన్, జయశంకర్ ల జయంతి వేడుకలు



**ఖమ్మం, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్)** ప్రజా యుద్ధ నౌక గద్దర్, లౌకిక ప్రజా స్వామిక వాది జహీర్ అలీ ఖాన్ లా 3వ వర్ధంతి సభ ప్రొ" జయశంకర్ సార్ జయంతి నీ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ముందుగా తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద మహనీయుల కు నివాళి అర్పించి, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ముందు సంస్మరణ సభ నిర్వహించడం జరిగింది.గద్దర్ జీవిత మంతా ప్రజల కోసమే బ్రతికిన గొప్పవెక్తి 50 ఏండ్లకు పైగా పోరాడిన వ్యక్తి,అనేక పాటలు రాసి పడిన గొప్ప కవి కళాకారుడు. ప్రత్యేక తెలంగాణ కోసం రక్తాన్ని చిందించిన మహనీయుడు .గద్దర్ మిత్రుడు లౌకిక ప్రజాస్వామిక వాది జహీర్ అలీ ఖాన్ సి పత్రిక సంపాదకులు జహీర్ అలీ ఖాన్ గద్దర్ అంత యాత్ర లో మరణించడం బాధాకరం.ప్రొ జయశంకర్ సార్ మలిదశ ఉద్యమంలో భాగంగా తనవంతు పాత్రను పోషించడం జరిగింది.ఈ సభ కు దేవిరెడ్డి విజయ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి కాకి భాస్కర్,బిచ్చల తిరుమలరావు,చిర్ర రవి,విప్లవ కుమార్, పి.విజయ్ కుమార్, సిపిఎం నుండి ఎర్ర శ్రీనివాస్, సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ జిల్లకార్య దర్శి సివై పుల్లయ్య, దాసరి శ్రీనివాస్, టీ.వేణు,బాబూరావు, ఆవుల అశోక్,అబ్దుల్ రహ్మాన్,సంస్కృతిక కళాకారులు పాగి వెంకన్న, పమ్మి రవి, జాన్, అజయ్, కుమారి, గురవయ్య,కృపానందం, రాము,వెంకటరత్నం, మిత్ర బృందం పాల్గొన్నారు.

# మాదిగ బోనాల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** మాదిగ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యం లో శనివారం సంగారెడ్డి లో బోనాలుసంగారెడ్డి పట్టణం లో మొట్టమొదటిసారిగా మాదిగ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యం లో శనివారం బోనాల ఉత్సవం జరపనున్నారు. బోనాల ఉత్సవానికి సంబం ధించిన పోస్టర్ ను జగ్గారెడ్డి ఆవిష్కరించారు. మాదిగ బోనాల ఉత్సవా నికి శ్రీ అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామీజీ ని ఆహ్వానించామని ఆయన హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.శనివారం ఐబి నుండి మొదలై హస్తబల్ ఎల్లమ్మ గుడి వరకు బోనాల ఊరేగింపు ఉంటుంద ని నిర్వాహకులు తెలిపారు. ఈ బోనాల ఉత్సవం లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్వకెట్లు, పోలీసులు, జర్నలిస్ట్ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా శేరిపల్లి సర్పంచ్ పావని మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వర్గల్, ఆగస్టు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శేరిపల్లి గ్రామ సర్పంచ్ యర్ర పావని మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు మిత్రుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మిత్రుడు కావేరి యాదగిరి యర్ర మోహన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజును గుర్తుపె ట్టుకుని, ఇంతటి అభిమానంతో వేడుకలను నిర్వహించిన మిత్రులందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మిత్రుల ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుక లలో గజ్వేల్ మండల ఫొటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లిబత్తులు నాగరాజు, కోశాధికారి కావేరి యాదగిరి, సీనియర్ ఫొటోగ్రాఫర్లు ఎల్లంరాజు, బండి కిరణ్ తదితరులు పాల్గొని మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు అందజేశారు.

## జాతీయ స్థాయిలో రజత పతకం.. గుంటూరు పోలీస్‌కు గౌరవం

- కానిస్టేబుల్ పోతురాజును అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో రజత పతకం సాధించి గుంటూరు జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకొచ్చిన చేబ్రోలు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ డి. పోతురాజును జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోతురాజును మెడల్‌తో సత్కరించి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బయో ఇండోర్ స్టేడియంలో జూలై 23 నుంచి 30 వరకు నిర్వహించిన 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్--2026 పోటీల్లో భాగంగా జరిగిన పెన్‌కక్ సిలట్ 110 కిలోల విభాగంలో పోతురాజు రజత పతకం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం స్ఫూర్తిదాయకమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొని పోతురాజుకు అభినందనలు తెలిపారు.

## దేశభక్తిని చాటేలా గుంటూరులో తిరంగా యాత్ర

- 9న వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి నాజ్ సెంటర్ వరకు ర్యాలీ
- బీజేపీ నేతలు చెరుకూరి తిరుపతిరావు, వల్లూరు జయప్రకాశ్ నారాయణ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు గుంటూరులో ఈ నెల 9న తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి యాత్ర ప్రారంభమై మార్కెట్, లిబర్టీ థియేటర్, కృష్ణమహల్ థియేటర్ మీదుగా నాజ్ సెంటర్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఈ తిరంగా యాత్రకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నజీర్ అహ్మద్, గల్లా మాధవి, రాంజనేయులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొంటారని తిరుపతిరావు తెలిపారు.

జాతీయ జెండాలతో నిర్వహించే ఈ యాత్రలో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జాతీయ భావాన్ని మరింత బలోపేతం చేయడమే యాత్ర ఉద్దేశమన్నారు.

కార్యక్రమంలో వల్లూరు జయప్రకాశ్ నారాయణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, దర్శనపు శ్రీనివాస్, భీమినేని చంద్రశేఖర్, వై.వి. సుబ్బారావు, నడ్డి నాగమల్లేశ్వరి, శ్రావణ కుమారి, విమలాదేవి, కత్తిమేరీ సరోజిని, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, తిరంగా యాత్ర కన్వీనర్ డాక్టర్ చరకా కుమార్ గౌడ్, కో-కన్వీనర్ కృష్ణపాటి నారాయణరెడ్డి, బజరంగ్ రామకృష్ణ, తుంగ యశ్వంత్ తదితరులు పాల్గొంటారు.

## స్థానిక ఎన్నికలపై బీజేపీ వ్యూహరచన



- కార్పొరేషన్‌లో పోటీ చేసే స్థానాల్లో పటిష్ట కార్యాచరణకు కసరత్తు

**గుంటూరుజర్నలిస్ట్ ఫైల్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గుంటూరు నగరంలో బీజేపీ పోటీ చేయనున్న కార్పొరేషన్ స్థానాలపై పార్టీ నాయకులు వ్యూహరచన ప్రారంభించారు. ఈ మేరకు బీజేపీ గుంటూరు జిల్లా కార్యాలయం వాజ్‌పేయి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన నగర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ తరఫున ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి బీజేపీ పోటీ చేసే స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గుంటూరు కార్పొరేషన్‌లో బీజేపీ బలాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన వ్యూహాలను అమలు చేయాలని, కూటమిలో భాగంగా పార్టీ పోటీ చేసే స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గుంటూరు కార్పొరేషన్‌లో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ బీజేపీ పోటీ చేసే స్థానాల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని అన్నారు. ఎన్నికలకు ముందుగానే పార్టీ శ్రేణులను సమాయత్తం చేసి, ప్రజలతో విస్తృతంగా మమేకం కావాలని సూచించారు. గుంటూరు కార్పొరేషన్‌లో బీజేపీకి మరిన్ని స్థానాలు కేటాయించేలా రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్లాలని పలువురు నాయకులు కోరారు.

సమావేశంలో జూపూడి రంగరాజు, కొత్తూరి వెంకట సుబ్బారావు, భీమినేని చంద్రశేఖర్, దర్శనపు శ్రీనివాస్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, బజరంగ్ రామకృష్ణ, మాజీ కార్పొరేటర్లు నేరెళ్ల మాధవరావు, మంత్రి సుగుణ, కూతురు శ్రావణకుమారి, వై.వి. సుబ్బారావు, నడ్డి నాగమల్లేశ్వరి, తూర్పు బీఎల్‌ఏ-1 డాక్టర్ చరక కుమార్ గౌడ్, పశ్చిమ బీఎల్‌ఏ-1 క్రిష్టిపాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు ఎమ్మెల్సీ ఆలపాటి ఘన సత్కారం

- చేనేత రంగం దేశ వారసత్వానికి ప్రతీక
- నేతన్నల సంక్షేమానికి అండగా కూటమి ప్రభుత్వం
- ప్రతి కుటుంబం చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలి
- చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలి
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జగడిగుంటపాలెంలోని ప్రగడ కోటయ్యనగర్ పద్మశాలి కల్యాణ మండపంలో చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరై చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నేతన్నలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చేనేత రంగం భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా నేతన్నలు తమ కళా నైపుణ్యంతో అద్భుతమైన వస్త్రాలను రూపొందిస్తూ భారతీయ సంప్రదాయాలను ప్రపంచానికి చాటుతున్నారని కొనియాడారు. చేనేత కార్మికుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని ఆయన వివరించారు. ఒక్కో చేనేత కార్మికుడికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత రంగాన్ని పరిరక్షించడం, యువతను ఈ వృత్తివైపు ఆకర్షించడం, సంప్రదాయ కళను భావితరాలకు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చేనేత కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జొన్నాదుల మహేష్, పాలడుగు సురేంద్ర, నల్లిబోయిన నాగేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి, దివి హేమంత్, గోలి శ్రీనివాసరావు, అక్కల ప్రసాద్, మునగాల ధనంజయరావు, రవికుమార్, దివి వాసు, భాస్కర్, గోపాల్, లక్ష్మీనారాయణ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గుండెల్లో బీజేపీ జెండా

- అర్హులైన ప్రతి గిరిజన ఇంటికీ కేంద్ర పథకాలు
- కొండా.. మైదానమా.. తేడా లేదు... గిరిజన గడపగడపకూ బీజేపీ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** కొండ, మైదాన ప్రాంతాలనే భేదం లేకుండా రాష్ట్రంలోని ప్రతి గిరిజన కుటుంబానికి బీజేపీ చేరువ కావాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన ఫౌండేషన్) పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమమే బీజేపీ ధ్యేయమని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయడమే ఎస్టీ మోర్చా ప్రధాన లక్ష్యమని అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకుని గిరిజన ప్రాంతాల్లో భారీ స్థాయిలో పోటీ చేసేందుకు పార్టీ సిద్ధమవుతోందని తపన చౌదరి తెలిపారు. ఎస్టీ మోర్చా ద్వారా గిరిజన సమాజంలోని ప్రతి వర్గాన్ని పార్టీతో అనుసంధానం చేస్తూ గ్రామస్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెప్పారు.

గ్రామగ్రామాన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని, వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి పార్టీ తరఫున కృషిచేయాలని కార్యకర్తలకు సూచించారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 24 వేల కోట్లను కేటాయించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికే నిధులు విడుదలయ్యాయని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోందని చెప్పారు. 2025--26 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 10,710 మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని, 2024-25లో 32,490 మంది గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించామని వివరించారు.

గిరిజన యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు స్టాండ్ అప్ ఇండియా పథకం ద్వారా రూ. 10 లక్షల నుంచి రూ. 1 కోటి వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. తక్కువ వడ్డీతో రుణాలు అందించడం ద్వారా గిరిజన కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు రూ. 157 కోట్ల విలువైన రుణాలను గిరిజనులకు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

**పథకాలను సద్వినియోగం చేసుకునేలా చైతన్యం**

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులు రాజ్యాధికార దిశగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్రసంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, ఎస్టీ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమ్మ, ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు గిరిజన కళాకారులు సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అతిథులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళాప్రదర్శనలు సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## సామాజిక సేవలో 'గివింగ్ బ్యాక్ టు సొసైటీ' ఆదర్శం



- మంగళగిరి కోర్టు ప్రాంగణంలో గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- ప్రారంభించిన గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి న్యాయస్థానాల భవన సముదాయంలో గివింగ్ బ్యాక్ టు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధి చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి శుక్రవారం ప్రారంభించారు. న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బందికి స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గివింగ్ బ్యాక్ టు సొసైటీ మరో మంచి సామాజిక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

సమాజం నుంచి పొందిన దానికి తిరిగి సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తితో గివింగ్ బ్యాక్ టు సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా ప్రజలకు నిత్యావసరమైన సదుపాయాలను కల్పించే దిశగా సంస్థ చేస్తున్న కృషి ఆదర్శప్రాయమన్నారు. కోర్టుకు వచ్చే ప్రజలు, న్యాయవాదులు, సిబ్బందికి శుద్ధి చేసిన తాగునీరు అందించడం ద్వారా సంస్థ సామాజిక బాధ్యతను చాటుకుందని కొనియాడారు.

ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజంలోని వివిధ వర్గాలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్న గివింగ్ బ్యాక్ టు సొసైటీకి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి. శేషమ్మ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. సురేష్ బాబు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రసన్న లక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు జొన్నాదుల లెనిన్, బేతపూడి నాయుడమ్మ, రెంటపల్లి రాజేష్, బాజీ గంగాధర్, సూరబోయిన మురళీ, కట్టెపోగు కోటేశ్వరరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంతృప్త స్థాయి పెరగాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పథకాలు పట్ల ప్రజల సంతృప్త స్థాయి పెరగాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ అన్నారు.

పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సానుకూల స్పందన పొందేవిధంగా ఎప్పుడూ పనిచేయాలని సూచించారు. ప్రతి అంశాన్ని నిశితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. శాఖా పరమైన సూచీలకు అనుగుణంగా ఖచ్చితమైన, నాణ్యమైన డేటాను నమోదు చేసి, లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చేనేతకు చేయూత.. ప్రతి కుటుంబానికి సంక్షేమ భరోసా : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**భట్టిప్రోలు, (జర్నలిస్ట్ ఫైల్):** వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు గ్రామంలో "2 ఏళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, దీపం-2, ఎన్టీఆర్ భరోసా, సూపర్ సిక్స్ తదితర పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు, సూచనలను మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "చేనేతకు చేయూత.. నేతన్నకు భరోసా-నేతన్న సేవలో" కార్యక్రమంలో నక్కా ఆనందబాబు చేనేత కార్మికులతో మమేకమయ్యారు. రథం సెంటర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానికంగా తయారైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించారు. చేనేత కుటుంబాల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, కార్మికులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. చేనేత రంగం తెలుగు సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక వారసత్వానికి ప్రతీక అని, దానిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

భట్టిప్రోలు గ్రామంలో 4,900 కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా భారీగా ప్రయోజనం చేకూరుతోందని ఆనందబాబు తెలిపారు.

తల్లికి వందనం ద్వారా 1,406 మందికి రూ. 2.10 కోట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా 681 మందికి రూ. 1.36 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా 653 మందికి రూ. 3.19 కోట్లు, ఎన్టీఆర్ భరోసా ద్వారా 1,880 మందికి నెలకు రూ. 82 లక్షలు, గృహ నిర్మాణం కింద 643 ఇళ్లకు రూ. 11.57 కోట్లు, స్కాలర్‌షిప్‌లు, సీఎంఆర్‌ఎఫ్ తదితర పథకాల ద్వారా కూడా ప్రజలకు ఆర్థిక ప్రయోజనం అందుతోందన్నారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు, వీధి లైట్లు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

"ప్రతి ఇంటికి సంక్షేమం.. ప్రతి గ్రామానికి అభివృద్ధి.. ప్రతి కుటుంబానికి భరోసా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. 'నేతన్న సేవలో' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం చేనేత కార్మికుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని ఆనందబాబు తెలిపారు.

స్వర్ణాంధ్ర--విజన్ 2047 లక్ష్యంతో పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, అమరావతి అభివృద్ధి, పోలవరం, గ్రామీణ మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వేమూరు నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, చేనేత కార్మికులు, మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేతన్నలకు అండగా బీజేపీ...త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 'చేనేత యాత్ర'

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** చేనేత పరిరక్షణ, నేతన్నల గౌరవం, వారి ఆర్థిక, సామాజిక సాధికారత కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ తెలిపారు. 'బీసీ వృత్తులు--సాంస్కృతిక జీవనం మన ఆత్మాభిమానం' అనే భావనతో వారసత్వ వృత్తులు, సంప్రదాయ కళలు, గ్రామీణ జీవన విధానాలను పరిరక్షించేలా పలు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చేనేత భారతీయ సంస్కృతి, స్వదేశీ స్ఫూర్తికి ప్రతీక అని, లక్షలాది నేత కార్మికుల జీవనాధారమైన ఈ రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. 2015 నుంచి ప్రతి ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తూ చేనేత కళాకారుల ప్రతిభకు గుర్తింపు కల్పిస్తోందని తెలిపారు. 'ఇండియా హ్యాండ్లూమ్' బ్రాండ్‌తో పాటు క్లస్టర్లు, డిజైన్ అభివృద్ధి, నైపుణ్య శిక్షణ, ఆధునిక మగ్గాలు, ముద్ర రుణాలు, బీమా, మార్కెటింగ్ వంటి కార్యక్రమాలతో నేతన్నలకు అండగా నిలుస్తోందన్నారు.

ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన చేనేత సమ్మేళనంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చేనేత నాయకులు, కళాకారులతో చేనేత రంగ సమస్యలు, అభివృద్ధి అవకాశాలు, సంప్రదాయ వృత్తి పరిరక్షణ, మార్కెట్ విస్తరణ, యువతను చేనేత వైపు ఆకర్షించే అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఓబీసీ మోర్చా నాయకులు చేనేత కళాకారుల ఇళ్లకు వెళ్లి వారిని సత్కరించడంతో పాటు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి సంఘీభావం చాటుతున్నట్లు వెల్లడించారు.

చేనేత పరిరక్షణను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 'చేనేత యాత్ర' చేపట్టనున్నట్లు ఓబీసీ మోర్చా ప్రకటించింది. గాంధీ జయంతి సందర్భంగా యాత్రను ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. చేనేత కుటుంబాల ఇళ్లలో బస చేస్తూ వారి జీవన విధానం, వారసత్వ వృత్తి, నేతన్నల కష్టాలు, చేనేత వస్త్రాల విశిష్టత, భారతీయ సంస్కృతిలో చేనేతకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, యువత, చేనేత సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థలు పాల్గొంటారని తెలిపారు. ధర్మవరంలో భారీ చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, 'నేతన్న సేవలో' పథకం ద్వారా రూ. 25 వేల ఆర్థిక సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేతను కాపాడటం అంటే భారతీయ సంస్కృతిని కాపాడటమేనని, ప్రతి కుటుంబం కనీసం ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467